క్లుప్తంగా

తీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



తీరంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వజ్రపుకొత్తూరు రూరల్: అక్కుపల్లి శివసాగర్ తీరంలో సముద్ర స్నానాలకు దిగే పర్యాటకులకు జరిగే ప్రమాదాల దృష్ట్యా స్థానిక పోలీసులు శుక్రవారం యువకులు సాయంతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సీహెచ్ రామారావు మాట్లాడుతూ.. శివసాగర్ తీరంలో సముద్రం లోతట్టుగా ఉన్నందున పర్యాటకులు సముద్ర స్నానాలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విహారం కోసం తీరానికి వచ్చే పర్యాటకులకు వినోదం కలగాలే తప్పా విషాదం కలగకూడదని అన్నారు. ప్రమాదాల నివారణ కోసం హెచ్చరికలు చేస్తూ ఎప్పటికప్పుడు పర్యాటకులను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. యువకులు తామాడ నగేష్, తెప్పల చాణిక్య, డొంక శంకర్,టి.ప్రసాద్, టి.పవన్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కేజీబీవీని సందర్శించిన జడ్జి



తరగతి గదులను పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

నందిగాం: మండల కేంద్రంలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు కేజీబీవీని సందర్శించిన ఆయన తరగతి గదులను, గ్రంథాలయాన్ని పరిశీలించారు. మౌలిక సదుపాయాలపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్నేహపూర్వక న్యాయసేవలు, వాటి రక్షణపై అవగాహన కల్పించారు. నందిగాం ఎస్సై మహమ్మద్ అమీర్ ఆలీ, కేజీబీవీ ఎస్‌వో స్వాతి ఉన్నారు.

బడి బస్సులను బాధ్యతగా నడపాలి



పాఠశాలల పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ అనిల్‌కుమార్, ఎస్‌ఐ సత్యన్నారాయణ

ఇచ్ఛాపురం: పాఠశాలకు చెందిన వాహనాలను బాధ్యతాయుతంగా నడపవలసిన బాధ్యత డ్రైవర్‌పై ఉందని ఎంవీఐ అనిల్‌కుమార్, పట్టణ ఎస్‌ఐ వి.సత్యన్నారాయణ అన్నారు. పట్టణంలోని సురంగి రాజాక్రీడా మైదానం ఆవరణలో మండలంలోని ప్రైవేటు విద్యాసంస్థల వాహనాలను శుక్రవారం పరిశీలించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పలు సూచనలు చేశారు.

వ్యవసాయం కుదేలు



నిరసనలో రైతు సంఘాల ప్రతినిధులు

టెక్కలి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవలంబిస్తున్న రైతు వ్యతిరేఖ విధానాలతో వ్యవసాయం కుదేలవుతోందని పలు రైతు సంఘాల ప్రతినిధులు మండిపడ్డారు. సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం టెక్కలిలో క్విట్ కార్పొరేట్ కార్యక్రమంతో నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రైతు సంఘాల ప్రతినిధులు ఎస్.షణ్ముఖరావు, బి.వాసుదేవరావు, కోత మధు, పి.సాంబమూర్తి, బి.మల్లయ్య, కె.ఎల్లయ్య, ఆనందరావు, కె.శంకరప్రసాద్, యు.లక్ష్మణరావు ఉన్నారు.

జోరుగా పారిశుద్ధ్య పనులు



మామిడిపల్లిలో బ్లీచింగ్ జల్లుతున్న సిబ్బంది

పలాస: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పొడరును వేశారు. మామిడిపల్లి, బొడ్డపాడు, బ్రాహ్మణతర్లా తదితర గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేయించారు.

ఇబ్బందులు పడతాం



పలాస నియోజకవర్గంలో విభిన్న పరిస్థితులు ఉన్నాయి. ఉద్దాన ప్రాంతంలో ఇసుక తిన్నెలు, సముద్రతీరం, గిరిజన, పల్లపు, పట్టణ, కొండ ప్రాంతాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాలకు ఎండీయూ వాహనాలతో ఇళ్ల వద్దనే సరుకులు అందేవి. వీటిని రద్దు చేస్తే ప్రజలు ఇబ్బంది పడతారు. కిలో మీటర్ల దూరం వెళ్లి రేషన్ సరుకుల కోసం పడిగాపులు కాయాలి. ఎండీయూ వాహనాలను రద్దు చేయకుండా పాత విధానాన్నే కొనసాగించాలి.

– సుజాత యాదవ్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ

పడిగాపులు పడతాం..



ఇంటింటికీ రేషన్ ఇచ్చే విధానం చాలా బాగుంది. దానిని ప్రస్తుతం రద్దు చేస్తే మహిళలం చాలా ఇబ్బందులు పడతాం. మేము రెండు కిలో మీటర్లు నడిచి వెళ్లి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. వర్షాకాలం, వేసవి కాలం చాలా ఇబ్బంది పడాలి. పైగా అక్కడ నెట్‌వర్కు లేక ఈ-పాస్ మిషన్ ట్రిమ్‌లు పనిచేయడం లేదంటూ కాపలా పెడతారు. చక్కగా ఇంటి వద్దకే వచ్చి ఇస్తున్నారు కదా. దయచేసి ఇంటింటికీ రేషన్ విధానం రద్దు చేయకండి

– జి. మీణ, పీఎంపురం, వజ్రపుకొత్తూరు మండలం

గిరిజనులకు ఇబ్బందే..



మా గ్రామానికి సచివాలయం కార్యాలయం ఉన్న కొండలొగం పంచాయతీ కేంద్రానికి సుమారు నాలుగు కిలోమీటర్లు దూరం. గ్రామం నుంచి అందరూ బియ్యం కోసం అంత ప్రయాణించాలంటే ఇబ్బందులు పడతాం. పూర్వ రోజులలో గిరిజనులం అంతా తోటలలో, రోడ్డుపై నడుచుకుని వెళ్లి తలపై మూటలు పెట్టుకుని వచ్చేవారిమి. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి వస్తే గిరిజనులకు ఇబ్బందే. ఎండీయూ వాహనాలను కొనసాగించాలి.

– సవర నందు, గోపుటూరు గ్రామం, మందస మండలం

సక్రమంగా అమలు జరుగుతున్న పథకం



గతంలో రేషన్ డీపో వద్ద సరుకులు అందజేసేవారు. ఆ సమయంలో వృద్ధులు, దివ్యాంగులు ఎంతో ప్రాయాస పడుతూ గంటల తరువాత రేషన్ తెచ్చుకునేవారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటికే రేషన్ వాహనంతో ఆ బాధలు తీరిపోయాయి. మళ్లీ పాత పద్ధతినే కూటమి ప్రభుత్వం అమలు పరుస్తుందని పుకార్లు వినిపిస్తున్నాయి. దీని వల్ల దినసరి కూలీలు, చిరు ఉద్యోగులు ఇబ్బందులు పడతారు. ప్రభుత్వం పునరాలోచించాలి.

– కొచ్చెర్ల యాదవరెడ్డి, కొత్తారీ గ్రామం, ఇచ్ఛాపురం మండలం

కష్టాలు తెచ్చిపెట్టవద్దు



గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ పంపిణీ వలన మాలాంటి మారుమూల గ్రామాల్లో ప్రతీ ఒక్కరికీ ఇంటి దగ్గరకే రేషన్ సరుకులు అందేవి. ఇప్పుడు ఆ పథకాన్ని రద్దు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. మళ్లీ మాకు రేషన్ కష్టాలు మొదలవుతాయి. గతంలో మా గ్రామం నుంచి సుమారు ఐదు కిలోమీటర్లు వెళ్లి రేషన్ సరుకులు తెచ్చుకునేవాళ్లం. కొన్నిసార్లు రేషన్ అందేవి కాదు. మళ్లీ అవే కష్టాలు తేవద్దు.

-జె.చంద్రరావు, జేడిపేట, టెక్కలి మండలం

కష్టాలు తప్పవా!

- ప్రభుత్వ తీరుతో రేషన్ కార్డుదారుల్లో గుబులు
- మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్లు రద్దవుతాయని ఆందోళన

ఇచ్ఛాపురం రూరల్:

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన ప్రజా పంపిణీ వ్యవస్థను ఇప్పటి వరకు సమర్థవంతంగా అమలు చేసింది. గతంలో కూలి పనులు, వ్యవసాయ పనులకు వెళ్లే ప్రజలు నిత్యావసర సరుకుల కోసం రేషన్ డీపోల వద్ద గంటల తరబడి ఉంటేగాని సరుకులు దొరకని పరిస్థితి. దీన్ని దృష్టిలో పెట్టుకొని 2019లో ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించారు. శ్రమ, కాలం విలువ తెలిసిన ఆయన 2021 జనవరి ఒకటో తేదీ నుంచి ఇంటింటికీ రేషన్ పథకాన్ని ప్రారంభించారు. ఇంటివద్దకే వెళ్లి రేషన్ అందించే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్స్ (ఎండీయూ వాహనం) ద్వారా ప్రతి నెల ఒకటో తేదీ నుంచి వారం రోజుల పాటు గ్రామ సచివాలయం పరిధిలో ఉండే గ్రామాలకు నిత్యావసర సరుకులు అందించేందుకు చర్యలు తీసుకుంది. మూడున్నరేళ్ల పాటు సమర్థవంతంగా అమలు చేసిన పథకానికి కూటమి ప్రభుత్వం ఇప్పుడు మంగళం పాడేందుకు సిద్ధపడడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ తమకు కష్టాలు తప్పావా అని దిగులు చెందుతున్నారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని రేషన్ పంపిణీ వివరాలు		
మండలం	రేషన్ కార్డుల సంఖ్య	ఎండీయూ వాహనాలు
ఇచ్ఛాపురం/ మున్సిపాలిటీ	26,945	12
కవిటి	22,731	14
కంచిలి	20,167	13
సోంపేట	22,293	14



టెక్కలి: గత టీడీపీ పాలనలో రేషన్ సరుకుల కోసం టెక్కలిలోని ఓ చౌకధరల దుకాణం వద్ద క్యూ కట్టిన లబ్ధిదారులు (ఫైల్)

పలాస నియోజకవర్గంలో..

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గం పరిధిలో మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీ ఉన్నాయి. అందులో సుమారు రెండు లక్షల మందికిపైగా లబ్ధిదారులకు సరుకులు ప్రస్తుతం సక్రమంగా అందుతున్నాయి. ఎండీయూ విధానాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేస్తే రేషన్ కోసం పడిగాపులు కాయాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టెక్కలి నియోజకవర్గంలో ఇలా..			
మండలం	డిపోలు	ఎండీయూ వాహనాలు	రేషన్ కార్డులు
టెక్కలి	50	15	22,081
కోటబొమ్మాళి	53	14	23,262
సంతబొమ్మాళి	47	14	23,194
నందిగాం	48	12	18,519
మొత్తం	198	55	87,056



వైఎస్ జగన్ పాలనలో టెక్కలి మండలం శివారు గ్రామమైన హరిపురంలో లబ్ధిదారుల చెంతకే రేషన్ అందజేస్తున్న ఎండీయూ సిబ్బంది (ఫైల్)

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పలాస మండలం మొత్తం కలుపుకుని 19 బియ్యం పంపిణీ వాహనాలు ఉండగా 68 డీలర్ పాయింట్‌లు ఉన్నాయి. మందస మండలంలో 14 వాహనాలకు ఒకటి పాడవగా 13 వాహనాల ద్వారా ప్రస్తుతం సరుకులను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారు. ఇక్కడ 65 డీలర్ పాయింట్‌లు ఉన్నాయి. వజ్రపుకొత్తూరు మండలంలో 14 బియ్యం పంపిణీ వాహనాలు ఉండగా అక్కడ 57 మంది రేషన్ డీలర్లు సేవలు అందిస్తున్నారు. వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాల సేవలు ఉండవనే ప్రచారంతో ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతోంది.

గిరిజనులకు కష్టాలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరుకులు సక్రమంగా అందేవి. ఈ విధానాన్ని రద్దు చేస్తే గిరిజనులకు కష్టాలు తప్పవు. టెక్కలి మండలంలో సుమారు 20కి పైగా ఉన్నటువంటి గిరిజన గ్రామాల్లో ప్రజలు రేషన్ సరుకుల కోసం అవస్థలు పడతారు. ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దనే సరుకులు అందజేయాలి.

-బి.రాకేష్, సర్పంచ్, ముఖలింగాపురం, టెక్కలి మండలం.

డీలర్ వద్ద క్యూకట్టాలా?



ఎండీయూ వాహనాలను రద్దు డీలర్ దుకాణం వద్ద సరుకుల కోసం కట్టాల్సి వస్తుంది. ఎండీయూ వాహనాలతో ఇంటి వద్దకే రేషన్‌ను అందించడం బాగుంది. కొండకోనలు దాటి డీలర్ల వద్దకు వెళ్లి సరుకుల కోసం పడిగాపులు ఖాయడం ఇబ్బందిగా ఉంటుంది. ప్రస్తుత విధానాన్నే కొనసాగించాలి.

– సవర సోమేష్, కొయ్యదూరు, మందస మండలం

ఇంటి వద్దకే రేషన్ చేర్చాలి



ప్రస్తుతం అమలు చేస్తున్న ఇంటి వద్దకే రేషన్ ప్రక్రియను కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయాలి. ఎండీయూ వాహనాలతో రేషన్ అందించే విధానం బాగుంది. ఈ విధానాన్ని రద్దు చేయాలనే ఆలోచన తగదు. ప్రజా ప్రభుత్వమైతే ఇలాంటి నిర్ణయాలను తీసుకోదు. ప్రజల అవసరాలను గుర్తించి పాలన చేయాలి.

-మద్దిల పాపారావు, మామిడిపల్లి, పలాస మండలం

చాలా బాగుండేది



ఇంటి వద్దకే వాహనం ద్వారా వచ్చి రేషన్ సరుకులు అందించడం బాగుంది. తమలాంటి కూలీలకు ఎంతో ఉపయోగంగా ఉంది. గతంలో డీలర్ల వద్దకు వెళ్లి రోజుల తరబడి కూర్చుంటే గానీ రేషన్ దొరకని పరిస్థితి. కానీ ఇప్పుడు సమయానికి వాహనం రావడంతో అక్కడకు వెళ్లి తెచ్చుకొని తర్వాత కూలి పనులకు వెళ్లిపోతున్నాం. బియ్యం బండి ఉండాలి.

– బి.సావిత్రి, బూర్జపాడు పంచాయతీ, ఇచ్ఛాపురం మండలం

పోరాటాలే శరణ్యం

పలాస:

ఆదివాసీల మనుగడ కోసం పోరాటాలే శరణ్యమని వివిధ ప్రజాసంఘాల నాయకులు అన్నారు. పలాస మండలం గట్టూరు గిరిజన గ్రామంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సంఘీభావ ర్యాలీ, సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల భారత ఆదివాసీ వేదిక (ఏఐటీఎఫ్) నాయకులు సవర నారాయణరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆదివాసీ వ్యతిరేక నూతన అటవీ సంరక్షణ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆదివాసీలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గొరకల బాలక్రిష్ణ, పీవోడబ్ల్యూ జిల్లా నాయకురాలు పోతనపల్లి కుసుమ, పి.వై.ఎల్.జిల్లా కన్వీనరు సార జగన్, ఆదివాసీ నాయకులు సవర సుంకయ్య, సవర డాన్యేలు, సవర సోమేశు, సవర నందేశు, సవర లక్ష్మి, సవర జయ, రాపాక మాధవరావు, జడ్డే అప్పయ్య పాల్గొన్నారు.



పలాస: గట్టూరులో ర్యాలీ చేస్తున్న గిరిజనులు


ఘనంగా ఆదివాసీ దినోత్సవం

టెక్కలి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం టెక్కలిలో ర్యాలీ చేశారు. గిరిజన చైతన్య వేదిక, గిరిజన సేన, గిరిజన ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. గిరిజనుల రక్షణ కోసం రూపొందించిన చట్టాలను అమలు చేయాలన్నారు.

ఆదివాసీల హక్కులను కాపాడాలి

కంచిలి: ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాలని ఐటీడీఏ గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దుర్గాప్రసాద్ పాఢి అన్నారు. ఇందుకోసం వారిలో అవగాహన అవసరమన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని నువాగడ కాలనీలో శుక్రవారం ర్యాలీని నిర్వహించారు. డిప్యూటీ వార్డెన్ డి.తిరుపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వరిసాగుపై అవగాహన



వరుస క్రమంలో నాట్లు వేయిస్తున్న వ్యవసాయ సిబ్బంది

వజ్రపుకొత్తూరు: వరినాట్లను వరుస పద్ధతిలో వేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.కిరణ్‌వాణి అన్నారు. పాతటెక్కలిలో ఆరోగ్యవంతమైన పంట పండించే పద్ధతుల(జీఏపీ)పై రైతులకు అవగాహన కల్పించారు. పాతటెక్కలిలో 25 ఎకరాల్లో ప్రయోగాత్మకంగా వరుస పద్ధతిలో వరినాట్లను రైతులతో వేయించామన్నారు. ఈ పద్ధతి వలన పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి దుబ్బు కట్టి అధిక దిగుబడులు వస్తాయని వివరించారు. పంటకు జీఏపీ సర్టిఫికేషన్ ఇవ్వడంతో పాటు మార్కెట్ సౌకర్యం కల్పించి కొనుగోలు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు జ్యోత్స్న, పి.ఉదయ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూర్యనారాయణ, ధనుంజయ్, సంగీత, సరస్వతి, వీఏఏ ప్రవీణ ఉన్నారు.

ఉద్యమాలకు సన్నద్ధం కావాలి



నిరసన తెలియజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పలాస: స్వాతంత్ర్య ఉద్యమంలో క్విట్ ఇండియా స్ఫూర్తిని తీసుకొని దేశంలోని కార్పొరేట్ వ్యవస్థలకు వ్యతిరేకంగా క్విట్ కార్పొరేట్ ఉద్యమాలకు సిద్ధం కావాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా శుక్రవారం కాశీబుగ్గ మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ సంఘాల నాయకులు ఎన్.గణపతి, వంకల మాధవరావు, తామాడ సన్యాసిరావు, మద్దిల రామారావు, టి.అజయ్‌కుమార్ మాట్లాడారు. దేశంలో గతంలో ఎన్నడు లేని విధంగా కార్పొరేట్ పాలన సాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేశారన్నారు. క్విట్ కార్పొరేటు ఉద్యమం మరో క్విట్ ఇండియా ఉద్యమంలా సాగాలని కోరారు. కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు ఎస్.ఢిల్లీశ్వరి, దున్న శ్రీనివాస్, పి.కామేశ్వరరావు, ఎం.వినోద్, కె.దుష్యంత్, ఎం.భీమారావు, జె.భాగ్యలక్ష్మి, పి. నాగేశ్వరరావు ఉన్నారు.

ఎస్సీల వర్గీకరణపై పునః సమీక్షించాలి



సల్ల దేవరాజు

ఇచ్ఛాపురం రూరల్: ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును పునః సమీక్షించాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి, ఇచ్ఛాపురం నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు పల్ల దేవరాజు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎస్సీలుగా మాల, మాదిగలు, రెల్లి వంటి ఇతర కులాల వారంతా అన్నదమ్ములుగా కలసి మెలసి ఉంటూ జీవిస్తున్నామని, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో, ఇప్పుడు కూటమి ప్రభుత్వ హయాంలో వర్గీకర ణ చేసేందుకు ప్రయత్నించడం సరికాదని అన్నారు. ప్రభుత్వాలు తరఫున ఎస్సీ, ఎస్టీలకు దక్కాల్సిన ఫలాలు, ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు ఇవ్వాలే గానీ, ఇలా ఎస్సీ, ఎస్టీల్లో వర్గీకరణ పేరుతో కూలాలు మధ్య చిచ్చు పెట్టాలని చూస్తే న్యాయ పోరాటంతో ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విజయవాడలో బాబాసాహెబ్ 'సామాజిక మహా శిల్పాన్ని'ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తే, కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ విగ్రహ శిలా ఫలకాన్ని సుత్తులతో, ఇతర పరికరాలతో దాడి చేయడాన్ని దళితులమంతా ఖండిస్తున్నామని అన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని వెంటనే అదుపులోకి తీసుకొని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ సైనికుల సమావేశం రేపు

టెక్కలి: టెక్కలిలో ఆదివారం మాజీ సైనికుల సమావేశం నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు గొనప సోమేశ్వరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎన్‌టీఆర్ కాలనీలో గల కార్యాలయంలో ఉదయం పది గంటల నుంచి నిర్వహించనున్న ఈ సమావేశానికి సభ్యులంతా హాజరు కావాలని కోరారు.

సమాచారహక్కు చట్టం అధ్యక్షునిగా బాడాన

కంచిలి: సమాచారహక్కు చట్టం న్యాయ పోరాట సమన్వయ కమిటీ ప్రజారక్షణ భేరి మండల అధ్యక్షునిగా బాడాన నారాయణ ఎంపికయ్యారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఎన్నుకొన్నారు. జాతీయ కమిటీ చైర్మన్ కంచరాల సురేష్ చేతులమీదుగా నియామక పత్రాన్ని అందజేశారు

కలెక్షన్ సెంటర్ ప్రారంభం

కవిటి: ఉద్యానశాఖలో జిల్లా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్‌తో 2022-23 ఆర్థిక సంవత్సరం నిధులతో నిర్మించిన కలెక్షన్ సెంటర్‌ను రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. కవిటి తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఈ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఉద్యానశాఖ ద్వారా 75 శాతం రాయితీపై నిర్మించిన ఈ కేంద్రం ద్వారా రైతులు తమ ఉత్పత్తుల్ని అమ్మకాలు, కొనుగోళ్ల కేంద్రంగా సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. తహసీల్దార్ బి.మురళీమోహనరావు, ఎంపీడీవో కె.శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఓ పోలాకి మాధవీలత ఉన్నారు.

108 వాహనం పరిశీలన

కాశీబుగ్గ: పలాస మండల కేంద్రంలో ఉన్న 108 వాహనాన్ని పలాస డివిజన్ ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు, జిల్లా ప్లేట్ మేనేజర్ రామకృష్ణ శుక్రవారం పరిశీలించారు. సిబ్బంది బి.తారకేశ్వరరావు, ఎ.మోహనరావు, ఎన్.వెంకట్రావు ఉన్నారు.

విద్యుత్ ఏఈగా యోగేశ్వరరావు



యోగేశ్వరరావు

కాశీబుగ్గ: పలాసలోని ఏపీఈపీడీసీఎల్ కార్యాలయ ఏఈగా పైడి యోగేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ప్రొటెక్షన్ డిప్యూటీ ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఎగ్జిగ్యూటివ్ ఇంజినీర్‌గా ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సంబంధిత సమస్యలు ఉంటే తమను నేరుగా కలవచ్చునన్నారు.